క్లుప్తంగా

ఘనంగా దస్తగిరయ్య ఉరుసు



శ్రీహజరత్ దస్తగిరయ్య దర్గాలో చదివింపులు చదువుతున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కోటవీధిలో వెలసిన శ్రీహజరత్ దస్తగిరయ్య స్వాముల వారి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం గంధం, గురువారం కిస్తీల కార్యక్రమం చేపట్టారు. కిస్తీల సందర్భంగా గురువారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో నిర్వాహకులు దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి పలహారం బండిని భక్తులు మేళతాళాలతో ఊరేగించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సి.బెళగల్: గ్రామాలలో వారంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. ఆయన గురువారం మండల పరిధిలోని కొండాపురం, ఇనగండ్ల గ్రామాలలో సర్పంచ్‌లు రత్నమ్మ, ఇమ్మానియేల్ చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. గ్రామాలలో వారంలో మూడు రోజల పాటు (మంగళ, గురు, శనివారాలలో) పారిశుద్ధ్య పనులు చేట్టాలన్నారు. వీధుల్లో చెత్తచెదానం తొలగించాలని సూచించారు. అలాగే గ్రామాలలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి



మృతి చెందిన శివ

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రా మానికి చెందిన కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యర్రోళ్ల శివ (25) గత ఏడేళ్ల నుంచి గ్రామంలోనే పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పెట్టుబడుల కోసం ఖర్చులు, తగిన దిగుబడులు రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు ఎలా తీర్చాలో దిగులుతో మనస్తాపానికి గురై గత నెల 26వ తేదీన ఇంటిపై పురుగు మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. రైతు తండ్రి లింగమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

9న కాల్వబుగ్గలో బహిరంగ వేలాలు

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన కాల్వబుగ్గ దేవస్థాన ప్రాంగణంలో వివిధ వ్యాపారాలు నిర్వహించునేందుకు గాను ఈ నెల 9వ తేదీన ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలం పాటు (2023 నవంబర్ 9 నుంచి 2024 నవంబర్ 8వ తేదీ వరకు) పార్కింగ్ రుసుమును వసూలు చేసుకునే (ఆటోలకు రూ.10లు, ట్రాక్టర్, లారీ, బస్సులకు రూ.25ల చొప్పున వసూలు చేసుకోవాలి) హక్కు, టెంకాయ చిప్పలు పోగు చేసుకొనుటకు, దేవస్థాన ప్రాంగణంలో కేటాయించిన గదిలో టెంకాయలు అమ్ముకొనుటకు, తాత్కాలిక కల్యాణ మండపం నిర్మించుటకు, చెప్పుల స్టాండ్, 3 వ్యాపార దుకాణాలు నిర్వహించుకునేందుకు గాను వేలాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. అలాగే దేవస్థాన ప్రాంగణంలో ఐస్‌క్రీమ్ అమ్ముకొనుటకు రూ.20 వేలు, టీటీడీ కల్యాణ మండపం, సుంకిరెడ్డి కల్యాణ మండపంలో సప్లయర్ సామాను పెట్టుకొనుటకు రూ.50 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

11న మాదిగల విశ్వరూప మహాసభ

కర్నూలు (టౌన్) : ఈనెల 11న తణుకులో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయ్ పిలుపునిచ్చారు. గురువారం కల్లూరులోని ఓ హోటల్‌లో ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ సభకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో మాదిగలు, ఉపకులాలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాశపోగు సూరి మాదిగ, కో కన్వీనర్ ఆనంద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కల్లూరు మండల ఎంఆర్‌పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. కల్లూరు మండల అధ్యక్షులుగా జయప్రసాద్, రాముడు ఎన్నికయ్యారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించిన ఎమ్మెల్యే
- ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు
- హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎందే
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కొరటమద్దిలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: తాతా బాగున్నావా.. అవ్వ సకాలంలో పింఛన్ అందుతోందా.. అక్క, తమ్ముడు అమ్మ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, ఇంటి పట్టాలు, ఇళ్ల మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి అర్హత ఉంటే సంక్షేమ పథకాలు మంజూరు చేయిస్తానన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన ఆయన స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను సకాలంలో అందజేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్‌లు నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, అయ్యపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివానంద రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు రూరల్: అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేవిధంగా పకడ్బందీగా రూపొందించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ బీఎల్వోలను ఆదేశించారు.గురువారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణలపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..ఈనెల4,5 తేదీల్లో బీల్వోలంతా ఆయా బూత్‌లలో ఓటర్లకు అందుబాటులో ఉండి జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఫారం 6,7, 8 లలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడుమూరు తహసీల్దార్ జయన్న, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ మంజుల, ఏఎస్ఓ రఘువీరా డీటీ రామాంజినేయులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



హుసేనాపురంలో లబ్ధిదారుడి వేలి ముద్ర తీసుకుంటున్న వలంటీర్ మధుకుమార్



తిరుపాడు గ్రామానికి చెందిన లోకేశ్వరీకి వికలాంగ పింఛన్ అందిస్తున్న వలంటీరు నాగార్జున

ఓర్వకల్లు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. గురువారం మండలంలోని గ్రామాలలో వలంటీర్లు ఉదయాన్నే లబ్ధి దారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఒక్కొక్కరికి పింఛన్ సొమ్ము రూ. 2750ల చొప్పున అందజేశారు. మొత్తం 7,803 మందికి గాను 90 శాతం పింఛన్లు సుమారు రూ.2 కోట్లలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

గడివేముల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెండో రోజు గురువారం వలంటీర్లు వైఎస్సార్ పింఛన్ కానుకలను పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వేలిముద్రలు వేయించి నగదు అందజేశారు. గతంలో పింఛన్ కోసం వేచి ఉండాల్సి పరిస్థితి ఉండేదని ఇప్పుడు ప్రభుత్వం తమ వద్దకే సొమ్మును అందించడంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తాచాటాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి



విజేతగా నిలిచిన అశోకా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు

కర్నూలు (టౌన్): కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్రీలక్ష్మీ బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాలల క్రీడా ప్రాంగణంలో అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చురుగ్గా ఉంటారన్నారు. గెలుపోటములు సహజమని, ఓడిన మాత్రన కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. పట్టుదలతో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కరెస్పాండెంట్ విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువులో రాణిస్తూ క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేవీ శివకిషోర్, ప్రిన్సిపాళ్లు కన్నాకుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ–ఏ కబడ్డీ పోటీలకు అశోకా విద్యార్థినులు

జేఎన్‌టీయూ–ఏ అంతర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఏ.నేహ, నాగ ప్రవల్లిక ఎంపికయ్యారు. ఈనెల 1వ తేదీన తిరుపతిలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారిణులను జేఎన్‌టీయూ–ఏ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి అభినందించారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించండి




తిరుపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గడివేముల: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని నంద్యాల పరిశోధనా స్థానం అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, కీటక శాస్త్రవేత్త డాక్టర్ డీఎం శివరామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని తిరుపాడు గ్రామం పత్తిలో పురుగు మందు నిరోధకశక్తి పథకం కింద (2023–24) ఎంపికైంది. గ్రామంలో సాగు చేసిన పత్తిపంటలను పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.అనంతరం స్థానిక రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీజన్‌లో సాగు చేసిన ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం, వేపనూనె పిచికారీ చేయడం ద్వారా గులాబీ రంగు పురుగులను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, వీఏఏ రమేష్, ఎస్ఆర్ఎఫ్ హర్షవర్ధన్‌రెడ్డి, సూర్యతేజ, సాయిభారతి పాల్గొన్నారు.

అవినీతిపై ప్రతి పౌరుడు పోరాడాలి

కర్నూలు: అవినీతికి వ్యతిరేకంగా ప్రతి పౌరుడు పోరాడాలని ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్‌రావు సూచించారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఓర్వకల్లు మండలంలోని పవర్ గ్రిడ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్‌రావు ప్రసంగించారు. ప్రతి ఒక్కరిలో అవినీతికి వ్యతిరేకంగా ప్రశ్నించేతత్వం అలవడాలని, తద్వారా అవినీతి నిర్మూలనలో భాగం కావాలని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 14400, మొబైల్ యాప్ 14400 ద్వారా ప్రజలు ఫిర్యాదులను ఆడియో, వీడియో రూపంలో సాక్ష్యాలతో సహా అప్‌లోడ్ చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అవినీతి నిరోధక చట్టాలపై ఏసీబీ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. సీఐ ఇంతియాజ్ బాషా, పవర్‌గ్రిడ్ స్టేషన్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలాల రస్తా చూపండి



రైల్వే ఇంజినీర్లతో మాట్లాడుతున్న రైతులు

పాణ్యం: పొలాలకు వెళ్లే రస్తా సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం పాణ్యంలో డబ్లింగ్ పనుల పరిశీలనకు వచ్చిన రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ మురళీకి రైతులు వినతిపత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ.. అన్‌మ్యాడ్ లెవెల్‌క్రాసింగ్ 174వ గేట్‌ను రైతులకు తెలియకుండా తొలగించారన్నారు. గేటు అవతల సుమారు 250 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆ పొలాలకు వెళ్లేందుకు రైతులకు రస్తాలేకుండా పోయిందని వివరించారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తామని చెప్పిన రైల్వే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. దీంతో వాగుపై నిర్మించిన బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నామని, ఆ మార్గంలో యంత్రాలు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో భాగంగా రెండవ ట్రాక్ నిర్మాణం జరుగుతోందిని, వాగుపై నిర్మించే బ్రిడ్జిని నాలుగు మీటర్ల ఎత్తు పెంచితే యంత్రాలు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు చొరవ తీసుకొని బ్రిడ్జి ఎత్తు పెంచాలని కోరారు. రైతులు సమస్యను విన్న ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించండి



ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్, గూడురు, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులకు సూచించారు. గురువారం స్టాంటన్‌పురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 11 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉందని, ఆయా గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే చేసిన ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకొని పనులు మొదలు పెట్టాలని సూచించారు. గూడురు మండలంలోని జూలకల్లు గ్రామంలో ఫ్లోరైడ్ వాటర్ తాగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారన్నారు. గుడిపాడు గ్రామంలో చాలా ఏళ్లుగా కుంట నీరు తాగుతున్నారని, అక్కడా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మల్లాపురం, పెంచికలపాడు, కె.నాగలాపురం బూడిదపాడు గ్రామాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా జలజీవన్ మిషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సి.బెళగల్ మండలంలోని యనగండ్ల, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాలకు తుంగభద్ర నది నుంచి శుద్ధి చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టి శుద్ధి చేసిన తరువాతే నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. కోడుమూరు మండంలోని కొత్తూరు, వెంకటగిరి గ్రామాల్లోను, కర్నూలు రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం, ఆర్‌కె దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామాల్లోను తాగు నీటి సమస్యలు ఉన్నాయని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద చేపట్టే పనులు, పురోగతిపై నివేదిక అందజేయాలని, ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు వాయిదా



నిర్మాణాల తొలగింపు వద్ద హైవే అధికారులు, పోలీసులు

పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు గ్రామం మెట్ట వద్ద సర్వీస్ రోడ్డుపై అక్రమణల తొలపింపు వాయిదా వేసినట్లు హైవే అధికారులు తెలిపారు. గురువారం హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎస్ఐ అశోక్, సిబ్బంది బలపనూరు మెట్ట వద్ద సర్వీస్ రోడ్డు పక్కన అక్రణ నిర్మాణాన్ని తొలగించేందుకు చేరుకున్నారు. గతంలో నిర్వహకుడు నరసింహాకు ఆక్రణలను తొలగించుకోవాలని సూచించగా.. ఏ మాత్రం స్పందచలేదు. దీంతో ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు తొలగించేందుకు వెళ్లారు. ఆర్ఐ మహేశ్వరరెడ్డి మాట్లడుతూ.. ఆక్రమణపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు హోటల్ నిర్వాహకుడికి గతంలోనే పరిహారం కూడా అందించినట్లు తెలిపారు. అయితే నిర్మాణాన్ని తొలగించేందుకు అతను సహకరించడంలేదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధి లోని రాంబొట్ల ఆలయం ధర్మకర్తల మండలికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కెం.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వా రు ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మద్దూరునగర్‌లోని దేవదాయ ధర్మ దాయశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కాశీకి శివలింగాలు

కర్నూలు కల్చరల్: స్థానిక రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో గత నెల 29 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు బాలాజీ సమితి ఆధ్వర్యంలో బంక మట్టితో తయారు చేసిన 25 వేల శివలింగాలను గురువారం వారణాసికి పంపారు. హిందూబంధువులను ఐక్యం చేసి భక్తి భావం పెంపొందించడానికి శివ కోటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, సభ్యులు తులసమ్మ, వసుంధరమ్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన ఎదురూరులో గురువారం డీఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఎవరైనా ఫ్యాక్షన్ జోలికి వెళ్తే రౌడీషీట్లు ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలుగుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులను ఆశ్రయించి శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్ పాల్గొన్నారు.



కందువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

కర్నూలు (టౌన్): కల్లూరు మండలం రేమడూరు గ్రామంలో ఇద్దరు టీడీపీ వార్డు మెంబర్లతో పాటు 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్వగృహంలో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రేమడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ రెడ్డి, తిరుమలేష్, ఈశ్వరయ్యతో పాటు పార్టీలో చేరిన వారిలో రామాంజనేయులు, సుదర్శన్, బాలన్న, మద్దిలేటి, సురేష్, రాజు కుమార్, యుగంధర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి



గడివేములలో పరీక్షల మెటిరియల్‌ను పరిశీలిస్తున్న డీప్యూటీ డీఈఓ మహబూబ్‌బాషా

గడివేముల: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని నంద్యాల డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్ అన్నారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎంలతో సీస్ (స్టేట్ ఎడుకేషనల్ అచివ్‌మెంట్ సర్వే) అవగాహన సమావేశం నిర్వహించారు. సీస్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను హెచ్‌ఎంలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేయబడిన పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహిచండం జరగుతుందన్నారు. అనంతరం గని, గడిగరేవుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్షపై ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 విమలా వసుంధరాదేవి, సిబ్బంది విజయ్, హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం బాలాజీ నగర్‌లో పర్యటించారు. 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అమడగుంట్ల కృష్ణారెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించి పత్రాలను అందించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నాడు–నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే చేర్చామన్నారు. ఇవి ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమేశ్వర్ రెడ్డి, నాయకులు గిరి ప్రసాద్, జగన్ యాదవ్, రాము, గౌతమ్, శేఖర్, రాజు, సూరి, శ్రీనివాస గౌడ్, సచివాలయ కన్వీనర్లు కరీం, ఇర్షద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి తండ్రికి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామానికి చెందిన బోయ జయరాముడికి తన కుమారుడి వైద్యం ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల సీఎం ఆర్ఎఫ్ ఎల్ఓసీని గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తన గృహంలో అందజేశారు. ఈ సందర్భంగా జయరాముడు మాట్లాడుతూ తన కుమారుడు మహేష్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడన్నారు. ఇదే విషయం ఎమ్మెల్యే సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. త్వరలోనే హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో లివర్ మార్పిడి చేయించుకుని తన కుమారుడిని బతికించుకుంటానన్నారు. ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే సుధాకర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.